మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | శనివారం | 29-11-2025 | సంపుటి : 14 | సంచిక :173 | పేజీలు :8 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|
| RangaReddy | Saturday | 29-11-2025 | Volume :14 | Issue:173 | Pages:8 | Cost : 3 |



విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ
విశేష ప్రజాధరణ పొందుతున్న
నమస్తే హైదరాబాద్
తెలుగు దిన పత్రికకు
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని
జిల్లా, మండల కేంద్రాలలో
విలేకరులు కావలెను.

సీనియర్‌లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం
Ph: 9912580066

### పంచాయతీ ఎన్నికల నిర్వహణపై

## స్టే విధించలేం



**హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే హైదరాబాద్) :** పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని స్పష్టం చేసింది న్యాయస్థానం. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలని కోరుకుంటున్నారా..? అని పిటీషనర్‌ను ప్రశ్నించింది హైకోర్టు. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ జీవో-46పై హైకోర్టులో ఇవాళ (శుక్రవారం) విచారణ జరిగింది. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తామే చెప్పినట్లు హైకోర్టు గుర్తు చేసింది. గతంలో 2009లో ఇదే తరహా పరిస్థితి వచ్చినప్పుడు జీహెచ్ఎంసీ ఎలక్షన్‌ను రద్దు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలపగా.. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదని ఈసీ అడ్వొకేట్ చెప్పుకొచ్చారు. అయితే, ఈ దశలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని మరోసారి స్పష్టం చేసింది న్యాయస్థానం.

తామే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించి, తామే స్టే ఎలా ఇస్తాం..?? అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలని కోరారు పిటిషనర్ న్యాయవాది. ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. సబ్ కేటగిరి రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం హుకుం జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది హైకోర్టు.

## సీఎం సొంతూరులో

# సర్పంచ్ ఏకగ్రీవం

## కాంగ్రెస్ ఖాతా తెరిచిన రేవంత్ రెడ్డి..






**ఎం సొంతూరులో సర్పంచ్ ఏకగ్రీవం!**
**సర్పంచ్ పదవికి పోటీ పడిన 15 మంది**
**కొండారెడ్డిపల్లిలో ఎస్సీకి సర్పంచ్ రిజర్వేషన్**

**హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే హైదరాబాద్) :** తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కొనసాగుతున్న సందిగ్ధత నడుమ గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. గురువారం (నవంబర్ 27) నుంచి తొలి విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో.. గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్ పదవులపై కన్నేసిన కొందరు ఆశావాహులు.. పోటీ వద్దంటూ ఏకగ్రీవాల కోసం బేరసారాలు ప్రారంభించారు. గ్రామంలో గుడి, బడి వంటి వాటికి పెద్దమొత్తంలో నిధులిస్తామని చెబుతున్నారు. దీంతో గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంతూరులో సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలుస్తోంది.

సీఎం రేవంత్ రెడ్డి సొంత గ్రామం అయిన కొండారెడ్డిపల్లిలో సర్పంచ్ స్థానం ఎస్సీకి రిజర్వ్ చేశారు. దీంతో సర్పంచ్ పదవి కోసం 15 మంది పోటీ పడ్డట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గ్రామంలోని పెద్దలంతా కలిసి సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేసినట్లు సమాచారం. అయితే ఎన్నిక ఏకగ్రీవమైనప్పటికీ.. సర్పంచ్ పేరును అధికారికంగా ప్రకటించలేదు. సర్పంచ్ పదవిని ఆశిస్తున్న 15 మందిలో.. ఒకరి పేరును సీల్డ్ కవర్?లో ప్రకటించనున్నారని తెలుస్తోంది. దీంతో సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లిలో ఏ పార్టీ బలపరిచిన అభ్యర్థి విజయం సాధిస్తారనే ఉత్కంఠకు తెరపడినట్లైంది. సీఎం రేవంత్ రెడ్డి తన సొంతూరుతో కాంగ్రెస్ పార్టీ ఖాతా ప్రారంభించారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కొండారెడ్డిపల్లి మాత్రమే కాకుండా ఇప్పటికే కొన్ని గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మంతన్ గౌడ్ గ్రామ సర్పంచ్ స్థానాన్ని ఎస్టీకి రిజర్వ్ చేశారు. అయితే గ్రామంలో ఆ రిజర్వేషన్ కేటగిరీకి చెందిన ఎరుకలి భీమప్ప కుటుంబం మాత్రమే ఉంది. దీంతో ఆ ఫ్యామిలీకి జాక్‌పాట్ తగిలినట్లు అయింది. ఎరుకలి భీమప్పకు భార్య వెంకటమ్మ ఇద్దరు కుమారులు ఎల్లప్ప, మహేష్ ఉన్నారు. రిజర్వేషన్ల ప్రకారం సర్పంచ్‌తో పాటు ఎస్టీ జనరల్, ఎస్టీ మహిళ.. రెండు వార్డు రిజర్వేషన్లు వచ్చాయి. అంటే భీమప్ప కుటుంబం నుంచే సర్పంచ్‌తో పాటు ఇద్దరు వార్డు సభ్యుల ఎన్నిక దాదాపు ఏకగ్రీవమైంది. ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలం రాఘవాపురంలో సర్పంచ్ ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. అయితే ఆ గ్రామంలో మొత్తం 471 ఓట్లు ఉండగా.. ఒకే ఒక ఎస్సీ కుటుంబం ఉంది. ఆ కుటుంబంలో తల్లి కాంపల్లి కోటమ్మ, కుమారుడు రమేశ్ మాత్రమే ఉన్నారు. సర్పంచ్‌తో పాటు 4వ వార్డు కూడా ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ అయింది. అంటే తల్లి సర్పంచ్‌గా, కుమారుడు వార్డు సభ్యుడిగా ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

## దీక్ష పేరుతో నాటకం.



**హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే హైదరాబాద్) :** తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన దీక్షపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదన్నారు. దీక్ష పేరుతో కేసీఆర్ ఎనిమిది రోజులు ఫ్లూయిడ్స్ తీసుకున్నారని.. దీక్ష పేరుతో

2లో

## ముఖ్యమంత్రా.. రియల్ ఎస్టేట్ ఏజెంటా..?



**హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే హైదరాబాద్) :** రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్య మంత్రిలా కాకుండా, రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లా పనిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రజల ఆస్తులుగా ఉన్న 9300 ఎకరాల పారిశ్రామిక భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే

2లో

## వచ్చే ఏడాదిలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులు పూర్తి:



ప్రస్తుతం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర అనహనానికి గురవుతున్నారు. స్టేషన్ ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో.. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. అంతేకాకుండా.. వాహనాలను పార్కింగ్ చేయడంలోనూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు నిర్మాణ పనుల కారణంగా పెరిగిన కాలుష్యం (పొల్యూషన్) వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఇలా పలు రకాల సమస్యల కారణంగా రైలు ఎక్కేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా భావిస్తున్నారు. ఈ సమస్యపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రయాణికులకు శుభవార్త చెప్పారు. దీనికి సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే..

2లో

## ఆయుధ విరమణపై

### మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన



**హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే హైదరాబాద్) :** ఆయుధ విరమణపై మావోయిస్టు పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆయుధ విరమ ణపై ఓ తేదీని ప్రకటించింది. జనవరి 1వ తేదీన సాయుధ కాల్పులను విరమిస్తున్నట్లు స్పష్టం చేసిం ది. ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో ఇవాళ (శుక్రవారం) ప్రకటన విడుదల చేశారు. ఒక్కొక్కరు గా లొంగిపోయే బదులు, అందరూ కలిసి లొంగిపో తామని ఈ లేఖలో పేర్కొన్నారు. పరస్పర సమన్వ యం , కమ్యూనికేషన్ కోసం నక్సల్ ప్రతినిధి ఓపెన్ ఫ్రీక్వెన్సీ నంబర్‌ను కూడా విడుదల చేసినట్లు తెలిపారు. తమకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే ప్రభు త్వం ఎదుట ఆయుధ విరమణ చేస్తామని స్పష్టం చేశారు. ఆయుధాలు వదులుకోవడం అంటే ప్రజ లకు ద్రోహం చేయడం కాదని ఎంఎం సీ జోన్ ప్రతినిధి అనంత్ పేర్కొన్నారు.

కాగా, మావోయిస్టుల చర్యలను కట్టడి చేయడానికి కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మావోయిస్టులను కేంద్ర బలగాలు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నాయి. ఇటీవల ఏపీలోని మారేడుమిల్లిలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మాతో పాటు పలువురు కీలక నేతలు మృతి చెందారు. ఈ క్రమంలోనే ఆయుధ విరమణపై మావోయిస్టు పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం

## నిజామాబాద్‌లో ఘోరం..

**నిజామాబాద్, నవంబర్ 28 (నమస్తే హైదరాబాద్) :** ప్రేమించి మోసపోయానని గ్రహించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. నిజామాబాద్ జిల్లా దొంచందకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి.. ఏరుగట్లకు చెందిన ఓ యువతితో ఆరేళ్లుగా ప్రేమలో పడ్డారు. ఇరువురు ఎంతో అన్యోన్యంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీకాంత్‌రెడ్డి తాను

2లో



### కాళేశ్వరం ప్రాజెక్టుపై కవిత

## షాకింగ్ కామెంట్స్



**కామారెడ్డి, నవంబర్ 28 (నమస్తే హైదరాబాద్) :** కాళేశ్వరం ప్రాజెక్టు పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు.

2లో

# దీక్ష పేరుతో నాటకం.

కేసీఆర్ నాటకం చేశారని ఆరోపించారు. కేసీఆర్ దీక్ష చేసిన సమయంలో డాక్టర్స్ ఇచ్చిన రిపోర్టులను కేటీఆర్‌కు పంపుతామని పీసీసీ చీఫ్ అన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణకు వచ్చింది ఏంటి అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో చనిపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమిస్తే విద్యార్థులు పోరాటాన్ని కొనసాగించారని అప్పటి సంగతులను గుర్తుచేశారు.

విద్యార్థుల ఆవేదన చూసి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు. కిరోసిన్ పోసుకున్న హరీష్ రావుకి అగ్గిపెట్టె దొరకలేదా అని ప్రశ్నించారు. ఫ్లూయిడ్స్ తీసుకుని ఐరోమ్ షర్మిల 16 ఏండ్లు దీక్ష చేశారన్నారు. ఉనికి కోల్పోయిన బీఆర్ఎస్ కోట్లాది రూపాయలతో దీక్షా దివాస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం దీక్ష చేసినట్లు కేసీఆర్ నాటకం ఆడారని.. ఇప్పుడు దీక్షా దివాస్ పేరుతో మళ్ళీ సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దీక్షా దివాస్‌ను పక్కన పెట్టి సోనియా గాంధీకి పాలాభిషేకాలు చేయాలని హితవుపలికారు. తెలంగాణలో నూకలు చెల్లిపోయాయని కేసీఆర్ భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయమని కేసీఆర్‌కు అర్థమైందని.. అందుకే ఆయన బయటకు రావడం లేదంటూ కామెంట్స్ చేశారు.

బీసీ రిజర్వేషన్లపై...

బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మహేష్ గౌడ్ స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కోర్టుకు వెళ్తామన్నారు. ఇంద్రా సహానీ, కృష్ణమూర్తి కేసులను ఛాలెంజ్ చేస్తామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశం ముగిసిపోలేదని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపు కోసం అడ్డు పడుతోంది బీజేపీ అని ఆరోపించారు. ఈ విషయంపై బీసీ నాయకులు.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్ళి ప్రశ్నించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడాలని ఎంపీలకు విన్నవించినట్లు తెలిపారు.

తెలంగాణకు రండి..

హిడ్మా, గణపతి ప్రజాసేవ కోసం త్యాగం చేశాని పీసీసీ చీఫ్ అన్నారు. లొంగిపోదామని వచ్చే మావోయిస్టులకు అవకాశం ఇవ్వాలన్నారు. లొంగిపోదాం అనుకునే మావోయిస్టులు తెలంగాణకు రావచ్చని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు మతం పేరుతో విషం నింపుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో చిచ్చు పెట్టినన్ని రోజులు ఇండియా ముందుకు పోదని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

## ముఖ్యమంత్రా.. రియల్ ఎస్టేట్ ఏజెంటా..?

కుట్ర చేశారని విమర్శించారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ఆ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస‌లో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి హిల్ట్ విధానం పేరుతో మరో భారీ కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. గతంలో ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి పారిశ్రామికవేత్తలు చౌకగా భూములు తీసుకున్నారని, ఇప్పుడా భూముల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాలు కట్టుకునేందుకు రేవంత్‌రెడ్డి అతి తక్కువ ధరకే అనుమతులిస్తూ రియల్ దందా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదారు వందల మంది కోసం రూ.5 లక్షల కోట్ల ప్రజల ఆస్తిని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో సగం డబ్బులు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకి వెళ్తున్నాయన్నారు. భూములను అప్పజెప్పే ఈ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లకు హామీ.. ఇచ్చింది 17 శాతం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మోసం చేసిందని కేటీఆర్ దుయ్యబట్టారు. గత ప్రభుత్వం 24% రిజర్వేషన్లు కల్పిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 17 శాతం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొందని విమర్శించారు. రిజర్వేషన్ల పేరుతో నాటకాలాడుతున్న కాంగ్రెస్ పార్టీకి బీసీ సోదరులు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను కేసీఆర్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేయగా.. మిగిలిన 10 శాతం పనులను కూడా రేవంత్‌రెడ్డి పూర్తి చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్ లాంటి మహానాయకుడే కల్వకుర్తిలో ఓడిపోయారని, రాజకీయాల్లో గెలుపోటములు సహజమని కార్యకర్తలకు కేటీఆర్ ధైర్యం చెప్పారు. రానున్న రోజుల్లో పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ కమిటీలను నియమించనున్నట్లు కేటీఆర్ తెలిపారు.

# నిజామాబాద్‌లో ఘోరం..

ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకునేందుకు లండన్ నుంచి నిజామాబాద్ వచ్చారు.అయితే.. సదరు యువతి తల్లిదండ్రులు ఆమెకు మరో యువకుడితో పెళ్లి జరిపించారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్‌రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు వెంటనే గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శ్రీకాంత్‌రెడ్డి మృతిచెందారు. ఈ ఘటనతో శ్రీకాంత్ కుటుంబం.. నిజామాబాద్ పట్టణంలో మృతదేహంతో ఆందోళనకు దిగింది. ఇంతలో పోలీసులు వీరి ఆందోళనను అడ్డుకున్నారు. దీంతో శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. శ్రీకాంత్‌రెడ్డి మృతిపై నిజామాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని అతడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

## బోడ బాల్య నాయక్ గారి పదవి విరమణ సన్మాన మహోత్సవం



**మహబూబాద్ ,నవంబర్ 27(నమస్తే హైదరాబాద్) :** గత 36 సంవత్సరములుగా గిరిజన ప్రాథమిక పాఠశాల ఎస్ జి టి బాధ్యతలు నిర్వహిస్తూ ఎందరో గిరిజన విద్యార్థులను తీర్చి దిద్దిన నిగర్వి గుణవంతుడు అధికారుల సహచరుల మరియు విద్యార్థుల మనసులో గొప్ప స్థానాన్ని పదిల పరుచుకున్న గొప్ప ఉపాధ్యాయుడు బాల్య నాయక్ ఉపాధ్యాయ వృత్తిలో సుమారు గత 36 సంవత్సరాలుగా సుదీర్ఘ సేవలను అందించి అధికారులు మరియు తోటి ఉద్యోగుల మనసులలో గొప్ప స్థానాన్ని పొంది ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భంగా 29-11-2025 శనివారం రోజున ఉట్ల- మత్వాడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల యందు శ్రీ వాసం సారంగపాణి గారి సభాధ్యక్షతన నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమానికి జి దేశి రామ్ (డిటిడిఓ) ఆర్ భాస్కర్ (ఏ టి డి ఓ) డి రాములు (ఏ సి ఎం ఓ )జె రవికుమార్( ఎంఈఓ )ముఖ్య అతిథులుగా రానున్నారు బోడ బాల్య నాయక్ అందించిన సేవలకు జరగనున్న ఈ అభినందన సభకు అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసింది సభాధ్యక్షులు కోరుతున్నారు.

# వచ్చే ఏడాదిలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులు పూర్తి:

వచ్చే ఏడాది నాటికి దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ అనుభూతిని అందించే లక్ష్యంతో.. హైదరాబాద్‌లోని కీలక రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు వేగవంతమయ్యాయి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం నాడు హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఈ విషయాలను వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సుందరీకరణ పనులు వచ్చే ఏడాదిలోగా పూర్తి స్థాయిలో పూర్తయి.. ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. సికింద్రాబాద్‌కు సమానంగా.. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను కూడా అత్యంత ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ కోసం మొత్తం రూ. 35 కోట్లు కేటాయించారు. ఈ పనులు రెండు విడతలుగా కొనసాగుతున్నాయి. మొదటి విడత పనులు వచ్చే ఫిబ్రవరి నెలలోపు పూర్తవుతాయని మంత్రి వెల్లడించారు. ఈ ఆధునికీకరణలో భాగంగా అత్యాధునిక వెయిటింగ్ హాల్స్, మెరుగైన ప్లాట్‌ఫారమ్‌లు, ప్రయాణికుల కోసం అనుకూలమైన మార్గాలు, మెరుగైన భద్రతా ఏర్పాట్లు వంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. రానున్న సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రయాణికులకు మరింత మెరుగైన.. ఆధునిక రైల్వే సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. ముఖ్యంగా పండుగల సమయంలో ప్రయాణ సౌలభ్యాన్ని పెంచడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా 16 ప్రత్యేక రైళ్లు హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో ఆగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది ఆయా ప్రాంతాలకు వెళ్లే వేలాది మంది ప్రయాణికులకు.. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు భారీ ఉపశమనం అందించనుంది. రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ.. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో ప్రభుత్వం నిబద్ధతను తెలియజేస్తుంది. ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే.. హైదరాబాద్ నగరం దేశంలోనే అత్యుత్తమ రైల్వే మౌలిక వసతులు కలిగిన నగరాల్లో ఒకటిగా నిలవనుంది.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కవిత షాకింగ్ కామెంట్స్

కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఒరిగిందేమీ లేదని విమర్శలు చేశారు. ఇవాళ (శుక్రవారం) కామారెడ్డిలో కవిత పర్యటించారు. పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం మీడియాతో కవిత మాట్లాడారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూడికతీతను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజాంసాగర్ టూరిజం, కౌలాస్ కోట ఓ స్పాట్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. మొంథా తుఫానుతో జిల్లాలో పత్తి రైతులు నష్టపోయారని చెప్పుకొచ్చారు. జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జిన్నింగ్ మిల్ కోసం జాగృతి పోరాటం చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల అనుమతి పేరుతో డబ్బులు తీసుకోవద్దని సూచించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు కవిత. సర్పంచ్ ఎన్నికల్లో యువత ముందుకు వచ్చి ఆయా సమస్యలపై పార్టీలను ప్రశ్నించాలని సూచించారు. రోడ్ల కోసం ఆందోళన చేస్తుంటే జుక్కల్ ఎమ్మెల్యే యువకుల మీద కేసులు పెట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. యువతపై నమోదైన కేసులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్ వెంటనే ఉద్యోగులను తిరిగి స్వస్థలాలకు పంపించాలని సూచించారు. గొర్రెల కోసం డీడీలు కట్టి చాలా మంది అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. అర్హులకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. ఆటోవాళ్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం..

నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

బోడుప్పల్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ..

పాల్గొన్న మాజీ మేయర్,మాజీ కార్పొరేటర్లు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు...



**బోడుప్పల్,నవంబర్ 28(నమస్తే హైదరాబాద్):** అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు.బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం అవరణంలో శుక్రవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్యాం సుందర్ రావు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మాజీ కార్పొరేటర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు హాజరై లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు.పట్టాలు అందుకున్న వారిలో ఆనందం వెల్లివిరిసింది.నాయకులకు, కమిటీ సభ్యులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సంధర్భంగా మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేరుతుందని,సన్న బియ్యం పంపిణి, రెండు లక్షల రూపాయలు రుణమాఫీ వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల విద్యుత్తు వంటి అభివృద్ధి పనులు చెప్పట్టిందని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ 10 లక్షలకు పెంపు ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేసిందని తెలిపారు.

రాష్ట్రంలో పేద ప్రజల గృహావసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ పథకం ఎంతోమందికి ఊరటనిస్తుందన్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రతా చిహ్నమన్నారు.సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఈ రోజు చిరస్మరణీయం రోజని గుర్తు చేశారు. లబ్ధిదారుల ఎంపికలో న్యాయం, సమానత్వం పాటించామని కమిటీ సభ్యులతో కలిసి కృషి చేశామని పేర్కొన్నారు. అర్హులందరికీ ఇండ్ల నిర్మాణం జరిగే వరకు సహాయ సహకారాలు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన మున్సిపల్ అధికారులకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ,మేడ్చల్ జిల్లా బిబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ కార్పోరేటర్లు బోమ్మక్ కళ్యాణ్ కుమార్,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి,భూక్య సుమన్ నాయక్,సీసా వెంకటేష్ గౌడ్, ఇందిరమ్మ కమిటి సభ్యులు మరాటి మల్లేష్,ఎ.రాములు,దయ్యాల అలివేలు,ఉప్పుగళ్ళ ప్రశాంత్,రాహూల్,వార్డు అధికారులు,లబ్దిదారులు పాల్గోన్నారు.

# వజ్జేష్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల్ కాంగ్రెస్ నేతలు మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, గడ్డం రవికుమార్





**ఉప్పల్, నవంబర్ 28 ( నమస్తే హైదరాబాద్ ):** మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన తోటకూర వజ్రేష్ యాదవ్ ని ఉప్పల్ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సుర్వి మురళి గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శుక్రవారం కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి , ఏ.ఎస్. రావు నగర్ మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి , గడ్డం రవికుమార్ , రామంతపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తవిడ బోయిన గిరిబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశ్వబ్రాహ్మణ అధ్యక్షులు గారు బిక్షపతి చారి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చర్ల సుధాకర్ రెడ్డి, చర్ల రామ్ రెడ్డి, సుధాకర్ శెట్టి వంగళా సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ డిసిసి నూతన అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అయి రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయం సాధిస్తుందని భీమా వ్యక్తం చేశారు. జిల్లా కమిటీ నిర్ణయించే కార్యక్రమాల విజయవంతానికి ముందుండి కృషి చేస్తామని వజ్రేష్ యాదవ్ కు హామీ ఇచ్చారు.

## బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వకపోతే తడాఖా చూపిస్తాం.. ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తిగా రద్దు చేయాలని బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద బీసీ సంఘాలతో కలిసి ఆయన భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త రిజర్వేషన్ విధానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, బీసీల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు.పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల జాబితాను ప్రకటిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 46ను వెంటనే రద్దు చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. గతంలో ఉన్న జీవో నంబర్ 9ను మళ్లీ అమల్లోకి తేవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ జీవోలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీ ఉండగా, కొత్త జీవోతో ఆ హక్కు దెబ్బతిన్నట్టు ఆరోపించారు. బీసీ సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశంపై ఆందోళనలు చేపడుతున్న నేపథ్యంలో కృష్ణయ్య హెచ్చరికలు మరింత కీలకంగా మారాయి. “మా డిమాండ్లను నెరవేర్చకపోతే బీసీల బలం ఏంటో చూపిస్తాం” అని ఆయన ఘాటుగా మాట్లాడారు. రాజకీయంగా బీసీలు గణనీయమైన శక్తిగా ఉన్న నేపథ్యంలో ఈ హెచ్చరిక ప్రభుత్వాన్ని ఒత్తిడిలో పెట్టే అవకాశం ఉంది.

ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఇంకా ప్రకటన కాలేదు. కానీ రిజర్వేషన్ వివాదం కారణంగా ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తం అయోమయంలో పడే పరిస్థితి కనిపిస్తోంది. బీసీ సంఘాల ఐక్యత, ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని ఉద్యమం రానున్న రోజుల్లో ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలి: మాజీ మంత్రి

**యూరియా కొరత వచ్చిందంటే ఈ అసమర్ధ ప్రభుత్వ పాలన వల్లనే**
**కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుంది**
**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు 420 హామీల వల్ల ప్రజలు మోసపోయారు**
**కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు హరి గోసలు పడుతున్నారు**
**మాజీ మంత్రి ఎర్రబెల్లి**





**దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్):** దేవరుప్పుల మండల కేంద్రంలోని అక్షర గార్డెన్ లో బిఆర్ఎస్ పార్టీ
విస్తృత స్థాయి సమావేశం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దేవరుప్పుల మండలంలోని గ్రామ ఇంచార్జీలు నాయకుల వారిగా సన్నాహక సమావేశం ఏర్పాటు చేయగా శుక్రవారం
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణిలో అంతా మోసం బతుకమ్మ చీరల పేరు మార్చి మన తెలంగాణ సంస్కృతిని దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారు. కష్ట కాలంలో మనవెంబడి ఉన్నవారే మన వారు.
సర్వేలన్నీ మన వైపే ఉన్నాయి.
బీసిలను మోసం చేసిందే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.ఈ ప్రభుత్వం ఒక దుర్మార్గుడి చేతిలో పడి నాశనం అవుతుంది.యూరియా కొరత వచ్చింది అంటే ఈ అసమర్ధ ప్రభుత్వ పాలన వల్లనే
కెసిఆర్ హయంలో రాజు గా బ్రతికిన రైతులు కాంగ్రెస్ పాలనలో పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చింది.
ఈ మండలంలో ప్రతి ఒక్క కార్యకర్తని కలుపుకొని పోయి పని చేయాలి. పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కష్టపడాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో
ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆర్ గారే ముఖ్యమంత్రి.
గడపగడపకు మన కార్యకర్త తిరిగి ఈ బోగస్ ప్రభుత్వం చేసిన బోగస్ హామీలను వాళ్లకు అర్థమయ్యే రీతిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.
కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుంది.
తొందర్లోనే కమిటీలు వేసి ప్రతి కార్యకర్తకి శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తాం.ఇందిరమ్మ ఇండ్లని ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ఇది ఒక మోసపూరితమైనటువంటి పథకం. బతుకమ్మ చీరలు బంధు పెట్టి ఇందిరమ్మ చీరలు అని మన ఆడబిడ్డలను మోసం చేసే కుట్ర జరుగుతుంది ఆనాడు కెసిఆర్ అందరికి బతుకమ్మ చీరలు ఇస్తే నేడు ఈ మోసపూరిత కాంగ్రెస్ మహిళా సంఘములో ఉన్న వారికే వారి పేరిట లోన్ తీసుకుని వారికి మాత్రమే ఇస్తుంది ఆ అప్పుకూడా మన ఆడబిడ్డల పైనే పడుతుంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బోగస్ 420 హామీల వల్ల
ప్రజలు మోసపోయారు.
తెలంగాణ లో ఒక పెద్ద బ్లాక్మెయిలర్ చేతిలో ప్రభుత్వం నడవటం చాలా బాధాకరమైన విషయం.రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ అడ్డగోలు హామీలు ఇస్తుంది దీనిపట్ల మనం అందరం జాగ్రత్తగా ఉండాలి.
కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అరిగోసలు పడుతున్నారు.
రాష్ట్రంలో మొత్తం రాక్షస పాలన కొనసాగుతుంది.. సరైన పాలన లేదన్నారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వేలన్నీ బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నాయన్నారు.
పార్టీ క్యాడర్ , యూత్ సోషల్ మీడియా నాయకులు ఈ ఎన్నికల్లో కష్టపడి పని చేసి మన సత్తాచాటాలి.
ప్రజలు , నిరుద్యోగ విద్యార్థులు, ఎన్నికల కోసం వేచి చూస్తున్నారు.
ప్రజలు రేవంత్ రెడ్డి పాలనలో చాలా అసమ్మతితో ఉన్నారని వ్యక్తం చేశారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లో 90% బీఆర్ఎస్ పార్టీ గెలుపొందుతామన్నారు.ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ ,జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్ల సుందర్ రామ్ రెడ్డి , జిల్లా నాయకుల బబ్బురి శ్రీకాంత్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్, పిఎసిఎస్ డైరెక్టర్ కొత్త జలంధర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,యూత్ నాయకులు,గ్రామ నాయకులు,కార్యకర్తలు, సోషల్ మీడియా నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో బర్రె మృతి



**దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్):** దేవరుప్పుల మండలం చిన్నమడూర్ గ్రామానికి చెందిన అనగాని రాజు అనే రైతుకి చెందిన గేదె విద్యుత్ షాక్ తగిలి శుక్రవారం సాయంత్రం 4:15 నిమిషాలకు మృతి చెందింది. మేత కోసం చుట్టూ పక్క పరిసర ప్రాంతానికి వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు తెలిపాడు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ. రైతు సుమారు లక్ష 8%శీ% వేల రూపాయలు విలువ గల బర్రె మరణించడంతో తనకు నష్టం వాటిల్లిందని విద్యుత్ శాఖ అధికారులు తనకు న్యాయం చేయాలని తెలిపారు. అలాగే నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని రైతు తన గోడు వ్యక్తం చేశారు. నిరుపేదనైనా తనకు గేదె ఇచ్చే పాలతో జీవనోపాధి పొందుతున్నారని ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

# నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

**ఘట్కేసర్ నవంబర్ 28 (నమస్తే హైదరాబాద్)** మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలో శనివారం (29.11.2025) ఘట్కేసర్ ఏఈ యశ్వంత్ తెలిపిన ప్రకారం ఉదయం 10.00 నుంచి 13.00 వరకు విద్యుత్ అంతరాయ ప్రాంతాలు ఎదులబాద్ విలేజ్. మధ్యాహ్నం 14.00 నుంచి 17.00 వరకు విద్యుత్ అంతరాయ ప్రాంతాలు బాలాజీ నగర్, మధ్యాహ్నం 15.30 నుంచి 16.00 వరకు విద్యుత్ అంతరాయ ప్రాంతాలు, ఎన్ఎఫ్సీ నగర్. పోచారం మున్సిపల్ పరిధిలో శనివారం (29.11.2025) నారపల్లి ఏఈ ప్రదీప్ తెలిపిన ప్రకారం ఉదయం 10.00 నుంచి 13:00 వరకు అన్నోజిగూడ, ఎస్ ఎల్ ఎన్ ఎస్ కాలనీ, ఎల్ఐజి, జైపూర్ కాలనీ, సత్య నగర్ కాలనీ, సాయి నగర్ కాలనీ, ఇంద్ర నగర్ ఓల్డ్ విలేజ్.
ఉదయం 11.00 నుంచి 11:30 వరకు టు బిహెచ్కె నాగారం, ఏవి కన్స్ట్రక్షన్స్, అగపే, ఎస్ బి ఎల్ టౌన్షిప్.
మధ్యాహ్నం 14.00 నుంచి 17.00 వరకు విద్యుత్ అంతరాయ ప్రాంతాలు సింగపూర్ టౌన్షిప్ ఏ1 నుండి ఏ 21, ఏ 36 నుండి ఏ 50, సి ఫోర్ నుండి సి10 బ్లాక్స్, పల్లవి స్కూల్ ఏరియా. విద్యుత్ అంతరాయం కి చింతిస్తూ, ప్రజలు సహకరించగలరు.

# రామంతపూర్ డివిజన్ బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు వేముల తిరుపతయ్య ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు



**ఉప్పల్, నవంబర్ 28 ( నమస్తే హైదరాబాద్):** మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా రామంతపూర్ డివిజన్ లో మెయిన్ రోడ్ పై ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి బిజెపి నాయకులు, కార్పోరేటర్ పూలమాలలు వేసి నివాళులు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు , రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా లు విచ్చేసి పూల మాలలు వేసి నివాళులర్పించి, మహాత్మ జ్యోతిరావు పూలే వెనకబడిన వర్గాలకు చేసిన సేవలు, వారి యొక్క ఆశయాలను కొనియాడారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉందని సూచించారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ముత్తినేని జగదీష్, తాళ్ల బాలకృష్ణ గౌడ్, వెంపటి శ్రీనివాస్, సంకూరి కుమారస్వామి, దర్శనాల సుధాకర్, కల్మకల లింగం, పలుగుల అంజయ్య పటేల్, తమ్మలి రవి, జక్క పర్వతాలు, దయాకర్ రెడ్డి, వెంపటి రామరాజు, మహేందర్ ముదిరాజ్, ఎర్ర సురేష్, మల్లేష్ యాదవ్, సురేష్, సతీష్ మరియు మహిళా నాయకురాలు వీణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు ని కలిసిన హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ నాయకులు





**ఉప్పల్, నవంబర్ 28 ( నమస్తే హైదరాబాద్):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు గా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సత్కరించి హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంది అగిరెడ్డి, సుధాకర్ రెడ్డి , మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి , హబ్సిగూడా డివిజన్ అధ్యక్షులు గన్నారం విజయకుమార్, డివిజన్ ప్రధాన-కార్యదర్శి దేవాదాయ-ధర్మాదాయశాఖ డైరెక్టర్ ధర్మేంద్ర నాయక్(ధర్మా), సాగర్ రెడ్డి , శేఖర్ రెడ్డి , హబ్సిగూడ డివిజన్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుండురాజన్న , యూత్ కాంగ్రెస్ నాయకులు సాయికిరణ్, సాయి రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వజ్రెష్ యాదవ్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రేటర్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగిరే దాకా శ్రమించి పనిచేస్తామని వదిలేసి యాదవ్ కు హామీ ఇచ్చారు.

# ప్రభుత్వంపై జగదీశ్వర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీక్ష దివస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణలో భారతదేశంలోనే అతిపెద్ద భూ స్కామ్ జరుగుతోందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలసీల పేరుతో భారీగా స్కాములు చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఖరీదైన భూములను ఇష్టమొచ్చిన వారికి కట్టబెడుతోందని ఆరోపించారు.



# అసాంఘిక కార్యకలాపాల అడ్డాగా ధర్మసాగర్ కొత్త బస్టాండ్..?



**ధర్మసాగర్, నవంబర్ 28 (నమస్తే హైదరాబాద్) :** హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండల పరిధిలో నిర్మించిన కొత్త బస్టాండ్ ఆశించిన విధంగా ప్రజలకు ఉపయోగపడకపోవడంతో, అక్కడ అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయనే ప్రజాభిప్రాయం వ్యక్తమవుతోంది. బస్సులు రాకపోవడం, రాకపోకలు లేకపోవడం వల్లఈప్రాంతం సంచలనాత్మకమార్పులకు గురవుతోంది. స్థానికులచెబుతు.. న్నవిధంగారోజుప్రయాణికులు లేరు ,పర్యవేక్షణ లేదు.. రాత్రివేళ బస్టాండ్ అసాంఘికకార్యకలాపాలకు అడ్డాగా మారుతోందనీబస్టాండ్ నిర్మాణానికి ఖర్చు చేసిన ప్రజాధనం వృథా అయిపోయిందనే భావనమరింతబలపడుతోంది. సక్రమంగా వాడకపోవడం వల్ల ఇక్కడి భవనం, వసతులు నెమ్మదిగా దెబ్బతింటున్నట్లు కనిపిస్తోందనీప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇంత పెద్ద మొత్తంలో నిర్మించిన బస్టాండ్ ఉపయోగం లేకపోతే ఎందుకు నిర్మించారు? ప్రజాధనాన్ని వృథా చేసి ఖాళీ ప్రదేశాన్ని సమస్యగా మిగిల్చారా?రోజు ప్రయాణాలు చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు, విద్యార్థులు, మహిళలు అందరూ ఒకే మాట చెబుతున్నారు.బస్సులు రాకుంటే బస్టాండ్ ప్రయోజనం ఏమిటి? కనీసం భద్రత, పర్యవేక్షణ, రాకపోకలు ఏర్పాటు చేసి ప్రాంతాన్ని సురక్షితంగా ఉంచాలినీ
ప్రజల ఆకాంక్ష.ధర్మసాగర్ బస్టాండ్ ప్రజల ప్రయోజనాలకు ఉపయోగించాలని, అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట పడేలా తక్షణ చర్యలు అవసరమని ప్రజలుఅభిప్రాయపడుతున్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం

**జ్యోతిరావు పూలే సేవా సంఘం అధ్యక్షులు బుర్ర మహేందర్ ముదిరాజ్**




**ఉప్పల్, నవంబర్ 28 ( నమస్తే హైదరాబాద్):** భారతదేశానికి స్వాతంత్ర్యం రాక మునుపే దేశంలో నిరక్షరాస్యతను నిర్మూలించి సామాజిక చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని రామంతపూర్ జ్యోతిరావు పూలే సేవా సంఘం అధ్యక్షులు బుర్ర మహేందర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం రామంతపూర్ లోని జ్యోతిరావు పూలే వర్ధంతిని మహాత్మ జ్యోతిరావు పూలే సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో సమానత్వం, విద్య, మహిళా సాధికారత, అణగారిన వర్గాల కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. స్వాతంత్ర్యం రాకమునుపే జ్యోతిరావు పూలే వాడవాడల విద్యాలయాలను ఏర్పాటు చేసి సమాజాన్ని చైతన్య పరచాలని తెలిపారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తి, ఆశయాలతో ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముత్తినేని జగదీష్ వెంపటి శ్రీనివాస్ మల్లేష్ యాదవ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాచారం డివిజన్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని అధికారులు మేల్కొని కూల్చివేయాలని కోరిన పోతగాని గోపాల్ గౌడ్



**ఉప్పల్, నవంబర్ 28 ( నమస్తే హైదరాబాద్):** నాచారం డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ సర్వే నెంబర్ 106 లో జరుగుతున్న అక్రమనిర్మాణం విషయంలో మొదటి నుండి అక్రమనిర్మాణం ఆపివేయాలంటూ కాలనీ పార్క్ కోసం కేటాయించిన స్థలమని, స్థానిక వెస్లీ ప్రభుత్వ పాఠశాలకు ప్రధాన రహదారిగా ఉన్న దారి స్థలంలో నిర్మాణం ఎలా చేపడతారని కాలనీవాసులతో కలసి సంభంధిత అధికారులను పలు మార్లు కలసి వినతిపత్రాలు అందచేసి అధికారుల నుండి ప్రతి నిత్యం పురోగతి తెలుసుకుంటూ జిల్లా న్యాయస్థానంలో ఈ అక్రమ నిర్మాణానికి సంభందించిన అసలు పత్రాలను అందచేసి ఎంతో ప్రయాశపడిన జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ . ప్రభుత్వ స్థలం కాపాడడం కోసం రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షించదగిన విషయమని అన్నారు. హైకోర్టు తీర్పును వెంటనే అమలుపరచి అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని,కోర్టు ఆదేశానుసారం విద్యుత్ నిలిపి వేయాలని, బిల్డింగ్ సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తప్పుడు ధ్రువపత్రాలతో అధికారులను తప్పుదోవ పట్టించి అనుమతులు పొందిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నట్లు పోతగాని గోపాల్ గౌడ్ తెలిపారు.అధికారులు స్పందించకుండా జాప్యం చేసినట్లయితే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.



## రాఘవేంద్ర నగర్ కాలనీవాసులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్






**ఉప్పల్, నవంబర్ 28 ( నమస్తే హైదరాబాద్):** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, జిహెచ్ఎంసి అధికారులు, రాఘవేంద్ర నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి సుమారు 36 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్ పనులను శుక్రవారం పర్యవేక్షించారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణ తప్పకుండా ఉండాలని, కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని, కాలనీలో ఉండే ప్రజలకు నిర్మాణ సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని, నాణ్యత ప్రమాణాల లో ఎటువంటి జాప్యం జరిగిన కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏ.ఈ. రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ కోకొండ, కోకొండ జగన్, పల్లె వేణు గౌడ్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బంటి గౌడ్, చిన్న, రాఘవేంద్ర నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ రాములు, ముకుందరావు, అడ్వకేట్ శ్రీనివాస్ రావు,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


## రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమం





**ఉప్పల్, నవంబర్ 28 ( నమస్తే హైదరాబాద్):** రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్ ఆధ్వర్యంలో 500 అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రామంతపూర్ లోని గాంధీ నగర్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేష్ రెడ్డి హాజరై స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి నెంబర్ మహమ్మద్ తౌఫిక్, రాజి రెడ్డి, సర్వ సత్తయ్య యాదవ్, ముత్యాల నరసింహ స్వామి, జిమ్ సందీప్, ఆదినారాయణ గౌడ్, బెస్త భాస్కర్, ఉపేందర్ రెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, మహమ్మద్ నహీం, గరక సుధాకర్, మొగలి లింగం, శ్రీనివాసగౌడ్, సిద్ది రాములు, రమేష్, తోట శంకర్, గుప్తా ప్రసాద్, సూరి శంకర్, సందీప్, షబ్బీక్, సాయి, బాలు, స్వామి, నరసింహ, పొగాకు వెంకటేష్, సంధ్యారాణి, గాయత్రి, పుస సత్తయ్య, ప్రేమ్, స్వామి, కుమారస్వామి, సాయి, విజయ్, శాల శ్రీధర్, కాశమల శంకర్, గౌతం, కిరణ్ లతోపాటు 500 మంది అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## పాఠశాలల సామర్థ్యం, భద్రత అంశాలపై విద్యా శాఖ, ఆర్టీఐ అధికారులతో టీఆర్ఎస్ఎంఏ నాయకుల భేటీ






**ఉప్పల్,నవంబర్ 28 ( నమస్తే హైదరాబాద్):** తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ (టీఆర్ఎస్ఎంఏ) నాయకులు విద్యార్థుల సంఖ్య (సామర్థ్యం) ప్రైవేట్ పాఠశాలల భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై శుక్రవారం పలువురు ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఈ ప్రతినిధి బృందానికి గౌరవ అధ్యక్షుడు శేఖర్ రావు, రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, ఉప్పల్ మండల్ అధ్యక్షుడు విజేందర్ రెడ్డి నాయకత్వం వహించగా, కార్యనిర్వాహక సభ్యులు శ్రీనివాస్, షేక్ మదార్, సాగర్, రాజు పాల్గొన్నారు. మొదటిగా ప్రభుత్వం పరీక్షల నిర్వహణ డైరెక్టర్ హరి, విద్యా కమిషనర్ నవీన్ నికోలస్లను నాయకులు కలిశారు. 10వ తరగతిలో ప్రతి సెక్షన్‌కు ప్రస్తుతం అనుమతించిన విద్యార్థుల సంఖ్యను 55కి పెంచేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం వల్ల, ముఖ్యంగా తక్కువ ఫీజు ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యప్రక్రియలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ఈ చర్య అత్యవసరమని వారు వివరించారు. టీఆర్ఎస్ఎంఏ బృందం ఆర్టీఐ కమిషనర్ భూపాల్ను కలిసి, ప్రైవేట్ పాఠశాలల రక్షణ, తక్కువ బడ్జెట్ సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. తరుచుగా ఎదురయ్యే అంతరాయాలు, బాహ్య ఒత్తిళ్లు, నిర్వహణ సమస్యలకు పరిష్కారం కోసం ఒక స్పష్టమైన, సుస్థిరమైన విధాన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.సమావేశాల అనంతరం మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల హితాలను కాపాడడం టీఆర్ఎస్ఎంఏ యొక్క ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ శాఖలతో నిరంతర సంభాషణ, సమన్వయం, సంప్రదింపుల ద్వారా విద్యా వ్యవస్థను మరింత దృఢతరం చేయడానికి కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

## రాజోలు పర్యటనలో పవన్‌కు దగ్గరగా తిరిగిన కార్యకర్త.. డిప్యూటీ సీఎం ఆఫీసు అలర్ట్!



**నమస్తే హైదరాబాద్ :** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజోలు నియోజకవర్గంలో చేపట్టిన పర్యటన సందర్భంగా ఒక అపరిచిత వ్యక్తి అనుమానాస్పదంగా కదలాడటంతో డిప్యూటీ సీఎం కార్యాలయం తీవ్ర అప్రమతమైంది. శంకరగుప్తం డ్రెయిన్ వల్ల దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీలిస్తున్న సమయంలోనే ఈ వ్యక్తి పవన్ సమీపంలోనే కనిపించడం మొదలైంది. అధికారులతో చర్చలు జరుపుతున్నప్పుడు, ఆ తర్వాతి కార్యక్రమాల్లో కూడా ఆ వ్యక్తి ఎప్పుడూ దగ్గరలోనే ఉండటం భద్రతా సిబ్బందికి అనుమానం కలిగించింది. పవన్ కళ్యాణ్‌ను ఎప్పటికప్పుడు దగ్గరగా గమనిస్తూ, ఆయన కదలికలకు అనుగుణంగా సంచరించిన ఆ వ్యక్తి గురించి డిప్యూటీ సీఎం కార్యాలయం వెంటనే సమాచారం సేకరించింది. తాజాగా వెలుగులోకి వచ్చిన సమాచారం ప్రకారం ఆ వ్యక్తి రాజోలు నియోజకవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్త అని తేలింది. ఈ విషయం తెలిసిన వెంటనే భద్రతా బృందం అప్రమతమై, ఆ వ్యక్తి కదలికలను గమనించడం మొదలుపెట్టింది.

ఈ ఘటనను డిప్యూటీ సీఎం కార్యాలయం అత్యంత కీలకంగా భావించి, కోనసీమ జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డికి అధికారికంగా సమాచారం అందించింది. పవన్ కళ్యాణ్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ విషయంలో ఎలాంటి రిస్క్ తీసుకోవడం లేదని, ఆ వ్యక్తి నేపథ్యాన్ని పూర్తిగా పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ప్రస్తుతం ఆ వైసీపీ కార్యకర్తపై పోలీసులు దృష్టి సారించారు. రాజోలు పర్యటనలో జరిగిన ఈ అనుమానాస్పద ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ఇప్పటికే ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పవన్ కళ్యాణ్ భద్రతపై ఇలాంటి అప్రమత్తత రాజకీయ పరిణామాలపై కొత్త చర్చను రేకెత్తిస్తోంది.


## ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజులపాటు కుంభవర్షాలు



**నమస్తే హైదరాబాద్ :** వాతావరణ శాఖ ఆంధ్రప్రదేశ్‌కు ముప్పు హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రంలో రాయలసీమ మరియు దక్షిణ కోస్తా జిల్లాలకు ప్రధానంగా తీవ్ర వర్షాలు, తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉందని విశాఖపట్నంలోని వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో 20 సెంటీమీటర్లకు మించి వర్షపాతం నమోదు కావచ్చని కూడా హెచ్చరించింది. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం తుఫానుగా మారి ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరనుందని భావిస్తున్నారు.తుఫాన్ "దిత్వా" పేరుతో నామకరణం చేయబడింది. ఇది బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంగా ఉండి, ఉత్తర%-%వాయువ్య దిశగా పయనిస్తోంది. రేపు ఉదయం (30వ తేదీ) ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరాలను తాకే అవకాశం ఉంది. తుఫాన్ వేగం ప్రస్తుతం గంటకు 10%-%15 కిమీగా ఉంది.వర్షాల ప్రభావం ఈ విధంగా ఉండనుంది: శుక్రవారం దక్షిణ కోస్తా జిల్లాల్లో వర్షాలు ప్రారంభమవుతాయి. ముఖ్యంగా నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వర్షాలు పడతాయి. నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో అతి భారీ వర్షాలు, ప్రకాశం, బాపట్ల, కడప, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది.తుఫాన్ తీరం దాటిన తర్వాత నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కుంభవృష్టి (తీవ్ర వర్షాలు) కురుస్తాయి. కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, కర్నూలు, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. సోమవారం ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అతి భారీ వర్షాలు, కోనసీమ, ఉభయగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.అలాగే, కోస్తా తీరం వద్ద గంటకు 60%-%80 కిమీ వేగంతో బలమైన గాలులు వీయవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## జేఎన్‌టీయూ బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా వనస్థలిపురంలో జేఎన్‌టీయూ బీటెక్ విద్యార్థిని దివ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. తన మరణానికి ఎవరూ కారణం కాదని సూసైడ్ లెటర్‌లో పేర్కొంది. కానీ విద్యార్థి సంఘాలు మాత్రం అధికారుల నిర్లక్ష్యం వల్లే దివ్య మృతి చెందిందని ఆరోపిస్తూ కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో ధర్నా చేపట్టాయి. ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాలు మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# మళ్లీ ల్యాండ్ పూలింగ్‌కు రంగం సిద్ధం

**నమస్తే హైదరాబాద్ :** అమరావతి, నవంబర్ 28: చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతి ప్రాంతంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ చేపట్టాలని రాష్ట్ర కేబినెట్‌లో ఆమోదం తెలిపింది. ఈ దశలో మరో16 వేల ఎకరాల సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ప్రక్రియపై ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. మొదటి దశలో ప్రభుత్వ భూమి16 వేల ఎకరాలు సీఆర్డీఏకు ప్రభుత్వం అప్పగించింది. రాజధాని అమరావతి కోసం మొత్తం 50 వేల ఎకరాలు రైతుల నుంచి భూ సమీకరణ చేపట్టాలని ప్రభుత్వం భావించింది. మొదటి దశలో రైతుల నుంచి 34 వేల ఎకరాల సమీకరణ.. రెండో దశలో మరో 16 వేల ఎకరాలపై కసరత్తు చేస్తోంది. త్వరలో ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను సీఆర్డీఏ విడుదల చేయనుంది.మొత్తం ప్రభుత్వ భూమి, రైతుల వద్ద నుంచి తీసుకున్న భూమితో కలిపి 74 వేల ఎకరాలలో రాజధాని నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టనుంది. ఇక ఈ రెండో విడత భూ సమీకరణకు సంబంధించి 7 గ్రామాల్లో భూ సేకరణ చేయనుంది. వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు, ఎండ్రాయిలో 2,166 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, వడ్డమానులో 1,913 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాల భూ సమీకరణకు ప్రభుత్వం రంగం సిద్ధం




చేస్తోంది. ప్రభుత్వ అసైన్డ్ భూములతో కలిపి మొత్తం 20, 494 ఎకరాల భూ సేకరణ ద్వారా సీఆర్డీఏ తీసుకోనుంది.

# 5న జిల్లాకు సీఎం?

## భామినిలో మెగా పీటీఎంకు హాజరు ఏర్పాట్లలో అధికారులు



**నమస్తే హైదరాబాద్ :** పార్వతీపురం, నవంబరు 28 ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లేదా విద్యాశాఖ మంత్రి లోకేశ్ వచ్చేనెల 5న జిల్లాలో పర్యటించనున్నారు. భామినిలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ (పీటీఎం) మీటింగ్‌కు వారు హాజరుకానున్నట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందస్తుగా శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ కమి షనర్ విజయరామరాజు భామినిలో ఆదర్శ పాఠశాలను సందర్శించారు. సంబంధిత అధికారులు, సిబ్బందికి పలు సూచ నలు చేశారు. మంత్రి నారా లోకేశ్ పర్యటన దాదాపు ఖరారవగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సమావేశానికి హాజరవుతారా ? లేదా! అనేది మరో రెండు రోజుల్లో స్పష్టం కానుంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

శ్రేణులతో ప్రత్యేక సమావేశం

పాలకొండ నియోజకవర్గంపై టీడీపీ అధిష్ఠానం ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించినట్లు సమా చారం. ఈ మేరకు వచ్చే నెల 5న మంత్రి నారా లోకేశ్ భామిని మండలంలో పర్యటించిన అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది. ఎవరు అవునన్నా.. కాదన్నా..పాలకొండ నియోజకవర్గంలోని టీడీపీలో రెండు బలమైన గ్రూప్‌లు ఉన్నాయి. ఇద్దరు బలమైన నాయకులు తెరవెనుక ఉంది ఆ గ్రూపులకు నాయకత్వం వహి స్తున్నారు. ప్రస్తుతం జనసేన పార్టీ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కూటమి అభ్యర్థిగా విజయం సాధించిన తర్వాత టీడీపీలో చాలామంది నాయ కులు, కార్యకర్తలు ఆయనతో నడవడం ప్రారంభించారు. మరికొంతమంది శ్రేణులు పార్టీ నియో జకవర్గ ఇన్‌చార్జిగా పడాల భూదేవి వెంట ఉన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవు తున్న దృష్ట్యా మంత్రి లోకేశ్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది. రెండు గ్రూపుల నాయకులు, కార్యకర్తలను ఒకేతాటిపైకి తెచ్చి.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

# అత్యంత డేంజర్ జోన్‌లో భారత్ హిమాలయాలు

**నమస్తే హైదరాబాద్ :** కొత్త భూకంప మ్యాప్‌ను భారత్ శుక్రవారం ఆవిష్కరించింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సవరించిన భూకంప రూపకల్పన కోడ్‌లో భాగంగా పూర్తి మార్పులు చేసి భూకంప ప్రమాద జోన్ల మ్యాప్‌ను విడుదల చేసింది. ఇందులో, మొత్తం హిమాలయ ప్రాంతాన్ని తొలిసారిగా అత్యధిక ప్రమాదకర జోన్ (కొత్తగా ప్రవేశపెట్టిన జోన్ %ఎ×%)లో గుర్తించారు. భారత భూకంప ప్రమాద అంచనాల్లో దశాబ్దాల తర్వాత జరిగిన అత్యంత ముఖ్యమైన మార్పులలో ఒకటిగా దీనిని పరిగణించాలి. తాజా మ్యాప్ ప్రకారం.. దేశంలోని 61% భూభాగం మధ్యస్థ నుంచి అధిక ప్రమాదకర జోన్ పరిధిలోకి చేరింది. గతంలో టెక్టోనిక్ ప్రమాదం ఉన్నప్పటికీ హిమాలయ ప్రాంతం జోన్ 4, 5గా విడిపోయి ఉండేది. కానీ, ప్రస్తుతం మొత్తం హిమాలయ ప్రాంతాన్ని అత్యధిక ప్రమాదకర జోన్ %ఎ×%గా వర్గీకరించారు. పాత మ్యాప్‌లు ముఖ్యంగా మధ్య హిమాలయాల్లో ప్రమాదాలను తక్కువగా అంచనా వేశాయి, ఎందుకంటే ఆ ప్రాంతంలోని అనేక ఫాల్ట్ లైన్ల వద్ద దాదాపు 200 ఏళ్లుగా భారీ భూకంపం సంభవించలేదు. ఈ దీర్ఘకాలిక నిశ్చలత కారణంగానే అక్కడ భారీ భూకంపం వచ్చే అవకాశాలు ఎక్కువని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హిమాలయాలు భూకంపాల ముప్పు జోన్‌లో ఉన్నాయి ఎందుకంటే భూమిపై అత్యంత చురుకైన టెక్టోనిక్ ప్లేట్లు అక్కడే కలుసుకుంటున్నాయి. భారతీయ ప్లేట్.. యురేషియా ప్లేట్‌లోకి సంవత్సరానికి ఐదు సెంటీమీటర్ల వేగంతో చొచ్చుకుపోతోంది. ఈ బలమైన కదలికలు హిమాలయాలను సృష్టించి, వాటిని ఇంకా పైకి నెడుతోంది.

ఈ నిరంతర ఘర్షణ భూమి పొరలో విపరీతమైన ఒత్తిడిని పెంచుతుంది. ఆ ఒత్తిడి అకస్మాత్తుగా పెరిగినప్పుడు శక్తివంతమైన భూకంపాలకు దారితీస్తుంది. ఈ ప్రాంతం భౌగోళికంగా కూడా చాలా కొత్తది. అంటే అక్కడి శిలలు ఇంకా సర్దుబాటు అవుతున్నాయి. దీనివల్ల పర్వతాలు మరింత అస్థిరంగా మారాయి. మెయిన్ ఫ్రంటల్ థ్రస్ట్, బౌండరీ థ్రస్ట్, సెంట్రల్ థ్రస్ట్ వంటి అనేక ప్రధాన ఫాల్ట్ వ్యవస్థలు ఈ పర్వత శ్రేణి కింద ఉన్నాయి. వీటిలో ప్రతి ఒక్కటి పెద్ద భూకంపాలను సృష్టించగలదు. శతాబ్దాలుగా పెద్ద భూకంపాలు సంభవించని సుదీర్ఘ భూకంప ఖాళీలను కూడా భూగర్భ శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటి కింద గణనీయమైన శక్తి నిల్వ ఉన్నట్టు సూచిస్తుంది. ఈ కారణాలన్నీ కలిసి హిమాలయాలను ప్రపంచంలోనే అత్యంత భూకంపాలు సంభవించే ప్రాంతాలలో ఒకటిగా మార్చాయి.

భూకంపాలు ఎందుకు వస్తాయి? భూమి లోపల ఉండే రెండు పెద్ద రాతి పలకలు నిరంతరం కదులుతూ ఉంటాయి. హిమాలయాల కింద ఇండియా ప్లేట్, యురేషియా ప్లేట్‌లోకి నెట్టుకుంటూ వెళ్తోంది. ఈ నెట్టడం వల్ల భూమి లోపల ఒత్తిడి పెరుగుతుంది. ఆ ఒత్తిడి ఒక్కసారిగా విడుదలైనప్పుడు భూకంపం వస్తుంది.




తాజా మ్యాప్‌లో హిమాలయన్ ఫ్రంటల్ థ్రస్ట్ వెంట దక్షిణ దిశగా విస్తరించే భూకంప అవకాశాలను పరిగణలోకి తీసుకున్నారు. దీని వల్ల మోహంద్ సమీపంలోని డెహ్రాడూన్ వంటి ప్రాంతాలకూ భూకంప ప్రమాదం పెరిగినట్లు గుర్తించారు. బాహ్య హిమాలయ ప్రాంతాల్లోని ఫాల్ట్ లైన్లు వద్ద జనాభా అధికంగా ఉన్నచోట భూకంప ప్రమాదం ఉంది. అందువల్ల వీటిని మళ్లీ అధిక ప్రమాద జోన్‌గా గుర్తించారు.

ఇకపై పరిపాలనాపరమైన సరిహద్దులు కాకుండా భౌగోళిక, శాస్త్రీయ వాస్తవాల ఆధారంగా ప్రమాదాన్ని అంచనా వేయనున్నారు. అతి ప్రమాదకర ప్రాంతాల్లో భవనాలు, వంతెనలు, నగర మౌలిక వసతుల రూపకల్పనలో మరింత కఠినమైన ప్రమాణాలను అనుసరించాల్సిన అవసరాన్ని ఇది నొక్కిచెబుతుంది. భారత-యురేషియా టెక్టానిక్ ప్లేట్స్ ఒకదానినొకటి ఢీకొట్టడం కొనసాగుతుండగా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లో భూగర్భంలో ఒత్తిడి నిరంతరం పెరుగుతోందని ఈ మ్యాప్ తెలియజేస్తోంది. జనసాంద్రత ఎక్కువగా ఉండడం వల్ల ఈ ప్రాంతాలకు ముప్పు మరింత తీవ్రమవుతోంది. పాత భవనాలను భూకంప నిరోధకంగా మార్చడం, మృదువైన నేల, క్రియాశీలక ఫాల్ట్‌లపై కొత్త నిర్మాణాలను నిలిపివేయడం, పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో ఈ కొత్త వర్గీకరణ భూకంప నిరోధక శక్తిని పెంపొందించే దిశగా కీలక అడుగు అని నిపుణులు భావిస్తున్నారు. అంతేకాదు, దేశవ్యాప్తంగా విపత్తు సంసిద్ధతను పూర్తిగా పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని, దీర్ఘకాలిక భద్రతా ప్రణాళికలలో కొత్త మార్గాలను అనుసరించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేస్తోంది.

# కాళోజీ యూనివర్సిటీ వీసీ నందకుమార్ రాజీనామా చేసారు

**నమస్తే హైదరాబాద్ :** కాళోజీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రాజీనామా చేశారు. ఇటీవల యూనివర్సిటీలో ఎదురైన పలు వివాదాలు ఆయనపై తీవ్ర ఆరోపణలు సృష్టించాయి. ముఖ్యంగా పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో అవకతవకలు, ఇష్టప్రకారం ఇన్-చార్జీల నియామకం వంటి అంశాలపై ఆరోపణలు వెలువడ్డాయి.ఈ నేపథ్యంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూనివర్సిటీ వ్యవహారాలపై పర్యవేక్షణ చేపట్టారు. ముఖ్యంగా కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీలో ఏర్పడిన సమస్యలపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నుండి వివరణ కోరారు. కొన్ని గంటల్లోనే వైస్ ఛాన్సలర్ నందకుమార్ రాజీనామా చేసినట్లు ప్రకటించారు.ముందుగా ఉన్నత యూనివర్సిటీలో ఏర్పడిన అస్తవ్యస్థ పరిస్థితులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ ప్రతిష్టకు నష్టం కలిగించే చర్యలను ఎవరికైనా ఉపేక్షించడం అసాధ్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే, ఉన్నత స్థాయి సంస్థల్లో పనిచేసే అధికారులు సమర్థత, పారదర్శకత, నిష్పక్షపాత విధానాలతో వ్యవహరించాల్సిన అవసరాన్ని ఉద్దేశించారు.ఈ



పరిణామంలో, అనూహ్యంగా నందకుమార్ రాజీనామా నిర్ణయం తీసుకోవడం మీడియా మరియు ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

## మహాత్మ జ్యోతిరావు పూలే " 135 వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన ఏ.పీ. టూరిజం శాఖ



**నమస్తే హైదరాబాద్ :** మహాత్మ జ్యోతిరావు పూలే " 135 వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన ఎ.పీ. టూరిజం శాఖ డైరెక్టర్ కొడాలి వినోద్ కైకలూరులో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నియోజకవర్గ టి.డి.పి. కో ఆర్డినేషన్ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు,కో కన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మీ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ టూరిజం శాఖ డైరెక్టర్ కొడాలి వినోద్, ఆర్యవైశ్య వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడిమర్రి మాల్యాద్రి,రాష్ట్రతెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు(రాజీ), జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి,తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,చిగురుకోట పి.ఎ.సి.యస్ అధ్యక్షులు చలసాని జగన్మోహనరావు, టిడిపి మైనారిటీ నాయకులు యమ్.డి జానీ,పట్టణ టిడిపి అధ్యక్షులు పడమట వాసు, ప్రధాన కార్యదర్శి రసూల్ ఖాన్,మాజీ యమ్.పి.టి.సి పైడిమర్రి రాధాకృష్ణ, తామరకొల్లు నీటి సంఘం అధ్యక్షులు గంగుల ఏసురాజు,మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు గంగుల శ్రీదేవి,ముంగర సీత,యమ్.డి ఉస్మాన్, రాష్ట్ర టిడిపి యాదవ సాధికారిక కార్యదర్శి తలారి రాజేష్,జిల్లా టిడిపి రజక సాధికారిక డైరెక్టర్ కంచర్ల రామకృష్ణ,జిల్లా తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చక్కా పూర్ణ,వేములపల్లి కారుణ్య,బంకపల్లి భాస్కరరావు,భూపతి రవీంద్ర, సయ్యద్ భాషిద్,లక్కింశెట్టి మోహన్, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు అబ్దుల్ బాబా,ఆటపాక గ్రామ టిడిపి అధ్యక్షులు రావినూతల సునీల్,ఏగిరెడ్డి సురేష్,అద్దేపల్లి బ్రహ్మాజీ,సయ్యద్ బషీర్,హబీబ్,జహీర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు

# ఐకానిక్ టవర్స్‌పై గందరగోళం

**పెదరుషికొండలో 50 అంతస్థులతో ఆరు టవర్స్**
**నిర్మించేందుకు వీఎంఆర్‌డీఏ ప్రణాళిక**
**ఆర్‌పీఎఫ్‌కు కానరాని స్పందన**
**ప్రముఖ సంస్థతో ఒప్పందం జరిగినట్టు సోషల్ మీడియాలో ప్రచారం**
**అటువంటిదేమీ లేదన్న చైర్మన్ ప్రణవ్‌గోపాల్**
**మరోసారి ప్రకటన ఇచ్చేందుకు యోచిస్తున్నట్టు వెల్లడి**



**నమస్తే హైదరాబాద్ :** విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పెదరుషికొండలో నిర్మించ తలపెట్టిన 50 అంతస్థుల ఐకానిక్ టవర్స్ నిర్మాణంపై సోషల్ మీడియాలో రకరకాలుగా ప్రచారం జరుగుతోంది. దీనిని ఖండించాల్సిన అధికారులు మౌనంగా ఉంటున్నారు. దాంతో ఇది ఉద్దేశపూర్వక ప్రచారమా?...అనే అనుమానం కలుగుతోంది.రాష్ట్రంలో అత్యంత ఎత్తైన అంటే 50 అంతస్థుల భవన నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ ఈ ఏడాది జూలైలో ప్రణాళిక రూపొందించుకుంది. పెబ్బల్స్ బీచ్ అపార్టుమెంట్ పక్కన (ఐటీ పార్కు దగ్గర) సర్వే నంబరు 331/1లో 4.07 ఎకరాల్లో ఐకానిక్ టవర్స్ నిర్మించాలనేది ఆలోచన. ఆరు ఐకానిక్ టవర్లు డిజైన్ చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా అనుమతి ఇచ్చింది. జాయింట్ వెంచర్/పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో చేపట్టాలని రిక్వెస్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌పీఎఫ్) పిలిచారు. అందులో 3 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే డ్యూప్లెక్స్ ఫ్లాట్లు ఉంటాయి. క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, చిల్డ్రన్ ప్లే ఏరియా, పూల్ డెక్, సైకిల్ ట్రాక్, జాగింగ్ ట్రాక్, తదితర అత్యాధునిక వసతులు ఉంటాయి. అయితే ఈ ఆర్‌పీఎఫ్‌కు ఒకేఒక్క దరఖాస్తు వచ్చింది.నగరంలోని సీతమ్మధారలో ఆక్సిజన్ టవర్స్ ఉన్నాయి. అవి రెండు టవర్స్, 36 అంతస్థులు. వీఎంఆర్‌డీఏ నిర్మించ తలపెట్టింది ఆరు టవర్లు, 50 అంతస్థులు. భారీ పెట్టుబడి కావాలి. ఇది లాభదాయకంగా ఉంటుందా?, ఉండదా?..అనే అనుమానంతో ఎవరూ ముందుకురాలేదు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే ప్రైవేటు సంస్థలు అనేక అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాల నిర్మాణం ప్రారంభించాయి. డిమాండ్‌కు మించి ప్రాజెక్టులు నడుస్తున్నాయి. వాస్తవం ఇలా ఉండగా...ఈ ప్రాజెక్టును నగరంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ దక్కించుకుందని, వారే నిర్మాణం చేపడతారంటూ సోషల్ మీడియాలో వారం రోజులుగా వైరల్ అవుతోంది. దీనిని వీఎంఆర్‌డీఏ అధికారులు ఎవరూ ఖండించడం లేదు.కైలాసగిరిపై అంటూ మరో ప్రచారంఇటీవల నగరంలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సు ముగిసిన మరుసటిరోజు (16వ తేదీ) ఆదివారం ఉదయం 7 గంటలకు పురపాలక శాఖా మంత్రి నారాయణ వీఎంఆర్‌డీఏలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ఆయన కైలాసగిరిపై 50 అంతస్థుల ఐకానిక్ టవర్ నిర్మిస్తున్నామని, దీనికి అనుమతులు కూడా ఇచ్చామని చెప్పినట్టు సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై తొలుత జిల్లా అధికారుల ప్రకటన కూడా ఆ విధంగానే విడుదలైంది. ఆ తరువాత నాలుక కరుచుకొని 'కైలాసగిరి' అనే పదం తొలగించారు. అంతే తప్ప ఆ ప్రాజెక్టు వచ్చే ఏరియా ఏమిటో స్పష్టత ఇవ్వలేదు. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుపై జరుగుతున్న ప్రచారం గురించి వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ వద్ద ప్రస్తావించగా, దీనిపై త్వరలోనే ప్రకటన విడుదల చేస్తామన్నారు. ఎవరికీ ఈ ప్రాజెక్టును అప్పగించలేదని, మరోసారి ప్రకటన ఇచ్చే అవకాశం ఉందన్నారు.

# ప్రపంచంలోనే ఎత్తైన శ్రీరాముడి విగ్రహం.. ఏకంగా 77 అడుగులు



**నమస్తే హైదరాబాద్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ .. ఇవాళ కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటనలు చేశఆరు. ఈ సందర్భంగా ఉడుపిలో గీతా పారాయణ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత.. గోవా వెళ్లిన మోదీ.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. దక్షిణ గోవాలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తమ్ మఠంలో ఏర్పాటు చేసిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 77 అడుగుల కాంస్య శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గుజరాత్‌లోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ శిల్పి రామ్ సుతార్ ఈ రాముడి విగ్రహాన్ని తయారు చేశారు. 550 ఏళ్ల మఠం సంప్రదాయాన్ని పురస్కరించుకుని నవంబర్ 27వ తేదీ నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు ఇక్కడ వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

గోవాలో 77 అడుగుల రాముడి విగ్రహం ఆవిష్కరణ

దక్షిణ గోవాలోని కనకోనా జిల్లా పార్టగల్ గ్రామంలో ఉన్న శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తమ్ మఠాన్ని ఇవాళ ప్రధాని మోదీ సందర్శించారు. ఈ మఠం ప్రాంగణంలో ప్రతిష్ఠించిన 77 అడుగుల ఎత్తు కలిగిన శ్రీరాముడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తమ్ మఠం.. భారతదేశంలోని అత్యంత పురాతన మఠాల్లో ఒకటి కావడం విశేషం. 370 సంవత్సరాల క్రితం పార్టగల్‌లో ఈ మఠాన్ని నిర్మించారు. ఈ మఠం 550 ఏళ్ల సంప్రదాయాన్ని పురస్కరించుకుని ప్రస్తుతం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఉడుపిలో లక్ష కంఠ గీతా పారాయణ

గోవా పర్యటనకు ముందు ప్రధాని మోదీ కర్ణాటకలోని ఉడుపిలో పర్యటించారు. ఉడుపి శ్రీ కృష్ణ మఠంలో జరిగిన లక్ష కంఠ గీతా పారాయణ కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష మందికి పైగా భక్తులు, విద్యార్థులు, పండితులు పాల్గొనగా.. వారితో కలిసి ప్రధాని మోదీ భగవద్గీత శ్లోకాలను పఠించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని మోదీ.. ఉడుపి తన జనసంఘ్ పూర్వగామి బీజేపీ సుపరిపాలన నమూనాకు కర్మభూమి అని గుర్తుచేశారు. 1968లోనే ఉడుపి మున్సిపల్ కార్పొరేషన్‌కు జనసంఘ్ నేత వీఎస్ ఆచార్య ఎన్నికవడంతోనే ఈ నమూనాకు పునాది పడిందని తెలిపారు. ప్రస్తుత పరిశుభ్రతా ఉద్యమానికి, డ్రైనేజీ వ్యవస్థకు ఉడుపి 5 దశాబ్దాల క్రితమే మార్గదర్శకంగా నిలిచిందని ప్రధాని మోదీ కొనియాడారు. ప్రధాని మోదీ ఉడుపి పర్యటనలో భాగంగా శ్రీ కృష్ణ మూలస్థానం ఎదురుగా ఉన్న సువర్ణ తీర్థ మండపాన్ని ప్రారంభించారు. అలాగే.. కనకదాసుడు శ్రీకృష్ణుడి దర్శనం పొందాడని నమ్మే పవిత్రమైన కిటికీ కనకన కిండికి కనక కవచాన్ని (బంగారు కవచం) కూడా జాతికి అంకితం చేశారు.

# ఒంటరితనం ఢిల్లీ కాలుష్యం కంటే డేంజర్,,,ఎన్ఆర్ఐ ఎమోషనల్ పోస్ట్



అమెరికా లేదా ఐరోపా దేశాలకు వెళ్లడం అంటే లైఫ్ సెట్ అయినట్టు అనుకుంటారు చాలా మంది. కానీ విదేశాల్లోని ఉద్యోగం, జీవనశైలి వెనుక, ఎంతటి భావోద్వేగ ఒంటరితనం దాగి ఉంటుందో ఒక ఎన్ఆర్ఐ చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఐదేళ్లుగా స్వీడన్‌లో ఉంటున్న అంకుర్ త్యాగి అనే భారతీయ వ్యక్తి.. అక్కడి క్లీన్ ఎయిర్, స్మూత్ సిస్టమ్స్‌ను వదులుకుని, ఢిల్లీలోని కాలుష్యం ఉన్నా సరే.. ఇండియాకు తిరిగి వచ్చేస్తున్నానని ప్రకటించారు. ఆయన పోస్ట్ చేసిన కారణం లక్షల మంది ప్రవాసీయుల గుండెలను తాకింది.

"యూరప్ అంటే పరిశుభ్రమైన గాలి, చక్కని రోడ్లు, అద్భుతమైన వ్యవస్థలు ఉంటాయని అందరూ అనుకుంటారు. అది నిజమే కావచ్చు. కానీ అక్కడ జీవితాన్ని నిర్మించుకోవడం అనేది పూర్తిగా భిన్నమైన వాస్తవం" అని అంకుర్ త్యాగి ఎక్స్ (ట్విట్టర్) లో పోస్ట్ చేశారు. ఆయన చెప్పిన అతిపెద్ద సమస్య, ఆశ్చర్యకరంగా, ఆర్థికం కాదు, ఒంటరితనం!

'మీరు ప్రతి పనినీ ఒంటరిగా చేసుకోవాలి. వంట చేయాలి, శుభ్రం చేయాలి, బిల్లులు కట్టాలి, బిడ్డను పెంచాలి.. ముఖ్యంగా ప్రతి చలికాలంలో నిన్ను చుట్టుముట్టే నిశ్శబ్దంతో పోరాడాలి' అంటూ తన మనసులోని వేదనను బయటపెట్టారు. విదేశాల్లో స్నేహితులు కూడా చాలా మర్యాదగా, దూరంగా ఉంటారని, ఇండియాలో ఉన్నట్లుగా బలమైన బంధాలు, సంఘీభావం అక్కడ ఉండదని త్యాగి ఆవేదన వ్యక్తం చేశారు. 'మన దేశంలో అవినీతి, గందరగోళం ఉన్న మాట వాస్తవమే. కానీ కనీసం మన చుట్టూ మనుషులు ఉంటారు. కానీ పశ్చిమ దేశాల్లోని సమస్యలు వేరే రకంగా ఉంటాయి, వాటి బాధను అనుభవించినవారికే తెలుస్తుంది. అవి మన లోపలికి మరింత బలంగా కోసుకుపోతాయి' అని ఆయన పేర్కొన్నారు.

అంకుర్ త్యాగి పోల్చిన పోలిక ఇప్పుడు నెట్టింట్లో ట్రెండింగ్‌లో ఉంది. ఢిల్లీలో కాలుష్యం ఎక్కువగా ఉన్నా సరే.. ఈ డిసెంబర్ 5న తాను ఇండియాకు తిరిగి వచ్చేస్తున్నానని ఆయన ధైర్యంగా చెప్పారు. "ప్రతి ప్రదేశానికి ఒక ఖర్చు ఉంటుంది. మనం దేన్ని భరించగలం అని మాత్రమే తెలుసుకోవాలి. నాకైతే ఇప్పుడు స్నేహితులు, కుటుంబ సభ్యుల రూపంలో నిజమైన ఆక్సిజన్ అవసరం" అని ఆయన ఆ పోస్ట్‌లో రాశారు. అంటే, విదేశాల్లోని శుభ్రమైన గాలి కంటే.. కుటుంబం, స్నేహితుల 'మద్దతు' అనే ఆక్సిజనే తనకు ముఖ్యమని పరోక్షంగా చెప్పకనే చెప్పారు.

మొత్తం మీద ఈ పోస్ట్.. వేలాది ఎన్ఆర్ఐల హృదయాన్ని తాకడమే కాక, చాలా మంది ప్రవాసీయులు తమ జీవితాల్లో ఎందుకు ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్నారు అనే విషయాన్ని గ్లోబల్ డిబేట్‌కు దారితీసింది. ఆస్ట్రేలియా, పారిస్ వంటి ప్రాంతాల్లోని ఇతర ఎన్ఆర్ఐలు కూడా ఆయన అభిప్రాయంతో ఏకీభవిస్తూ కామెంట్లు పెట్టారు. డబ్బు, మెటీరియల్ సక్సెస్ వెంట పరుగు పెడుతున్నప్పుడు, మానసిక ప్రశాంతత ఎంత ముఖ్యమో, మాతృదేశంలో లభించే సామాజిక మద్దతు విలువ ఎంత ఉందో ఈ ఒకే ఒక్క పోస్ట్ ప్రపంచానికి స్పష్టం చేసింది.

# విజన్-2047 డాక్యుమెంటులో ఆరోగ్యానికి ప్రాధాన్యం..

# పీహెచ్‌సీల్లో 2047 నాటికి వంద శాతం డాక్టర్లు

**వృద్ధుల కోసం హెల్తీఏజింగ్ తెలంగాణ మిషన్**
**డాక్యుమెంటుకు వైద్యశాఖ రూపకల్పన**
**దీనిపై రేపు సీఎం రేవంత్ సమీక్ష**



**నమస్తే హైదరాబాద్ :** హైదరాబాద్, నవంబరు 28 తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసంకాంగ్రెస్ ప్రభుత్వం 'హెల్త్ ఫస్ట్' వ్యూహానికి రూపకల్పన చేస్తోంది. ప్రజల ఆరోగ్యం బాగుంటేనే వారి ఉత్పాదకత పెరిగి అభివృద్ధి సాధ్యమవుతుందనే ఆలోచనతో రూపొందించిన 'హెల్త్ డెవల్‌పమెంట్ ఫస్ట్' అజెండాలో పలు లక్ష్యాలను నిర్దేశించుకుంది. విజన్ -2047 డాక్యుమెంట్ ద్వారా ఆర్థిక వృద్ధితోపాటు మానవ సమగ్ర అభివృద్ధిని ప్రధాన వ్యూహంగా మార్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఆరోగ్యం, విద్య, ఆదాయాన్ని ఒకే కొలమానంగా తీసుకునే మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ)లో 2047 నాటికి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని రేవంత్ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్థు ఇతర అధికారులతో సమావేశాలు నిర్వహించి నివేదికను రూపొందించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సమీక్ష నిర్వహిస్తారని అధికారవర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ, క్రిష్టినా జడ్ చోంగ్థుతోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారని వెల్లడించాయి.

2047 నాటికి పీహెచ్‌సీల్లో 100 శాతం డాక్టర్లు


గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (పీహెచ్‌సీ)ల్లో ప్రస్తుతం 42.8 శాతం మంది వైద్యులు ఉండగా, వచ్చే ఐదేళ్లలో దాన్ని 60 శాతానికి, 2047 నాటికి వందశాతానికి తీసుకెళ్లాలని వైద్యఆరోగ్య శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ప్రతి పదివేల మంది జనాభాకు డాక్టర్, నర్సుల నిష్పత్తి పది వరకు ఉండగా, దాన్ని 2047 నాటికి 44కు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ప్రస్తుతం గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎస్‌డీపీ)లో వైద్య రంగం వాటా 1 శాతం ఉండగా, దానిని 5 శాతానికి పెంచాలని నిర్ణయించారు. పిల్లలు, యుక్త వయస్సు బాలికలు, మహిళల్లో రక్తహీనత, పోషకాహార లోపం నివారణకు ప్రస్తుత చేపడుతున్న కార్యక్రమాలను మరింత బలోపేతం చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు వైద్యం పెడుతున్న ఖర్చులో 37 శాతం ప్రైవేటు రంగంలోకి వెళ్తోందని, దానిని 2047 నాటికి 6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, కార్పొరేట్ రంగాల నుంచి 63శాతం వైద్య ఖర్చులు వెళ్తున్నాయి.

వృద్ధుల కోసం సిల్వర్ సిటీ జోన్స్

రాష్ట్రంలో 2036 నాటికి 60 ఏళ్ల వయస్సు పైబడిన జనాభా 17% దాటే అవకాశం ఉందని అంచనా. ఈ నేపథ్యంలో వృద్ధుల సంరక్షణ కోసం నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య బీమా, వృద్ధాప్య, మానసిక ఆరోగ్య సహాయం వంటి ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు. 'హెల్తీ ఏజింగ్ తెలంగాణ మిషన్'లో భాగంగా వృద్ధుల కోసం సిల్వర్ సిటీ జోన్స్, యాక్టివ్ ఏజింగ్ హబ్స్, మెంటార్‌షిప్, సెకండ్ లైఫ్ కెరీర్స్ వంటి కార్యక్రమాల ద్వారా గౌరవప్రదమైన వృద్ధాప్య జీవనానికి ఒక సమగ్ర వ్యవస్థను నిర్మించనున్నారు. అంటువ్యాధుల పర్యవేక్షణ, స్క్రీనింగ్ కోసం డిజిటల్, కృత్రిమ మేధ(ఏఐ)ను వినియోగించాలని నిర్ణయించారు. ఆరోగ్యశ్రీ ద్వారా అత్యాధునిక వైద్య సేవలనుఅందుబాటులోకి తేవటంపై దృష్టి సారించనున్నారు.

# బీసీలపై రేవంత్ మొసలి కన్నీరు

హైదరాబాద్, నవంబరు 28 బీసీల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. బీసీలకు 42% మంత్రి పదవులు, బీసీ సబ్-ప్లాన్‌కు చట్టబద్ధత ఇవ్వడానికి ఏ కోర్టు అడ్డుపడిందో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బూటకపు హామీలిచ్చారని విమర్శించారు. మహాత్మా జ్యోతిబాఫూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో 42% బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలు మోసమని తేలిపోయిందని ఆరోపించారు.



# అందరూ ఆహ్వానితులే



**నమస్తే హైదరాబాద్ :** అందరూ ఆహ్వానితులే గంగానమ్మ జాతర నిర్వహిస్తూన్న గ్రామస్తులు ముదినేపల్లి మండలం పెదపాలపర్రులోని శ్రీశ్రీశ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానంలో ఈ నెల 30 వ తారీకున అమ్మవారి జాతర మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్న గ్రామస్తులు మీడియా ద్వారా గ్రామ పెద్దలు మాట్లాడుతూ మాగ్రామాన్ని చల్లగా చూస్తూ,తన కన్నా బిడ్డలుగా పాలిస్తూన్న గంగానమ్మ తల్లి జాతర మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని గ్రామస్తులందరూ అమ్మవారి జాతర మహోత్సవకార్యక్రమము లో పాల్గొని మొక్కుబడులు చెల్లించుకొని,పూజాకార్యక్రమాలలోనూ,రాత్రికి జరిగే జాతర లో మొక్కుబడులు చెల్లించుకొని అమ్మవారి అనుగ్రహ,కృపాకటాక్షాలకి పాత్రులు కావాలని తెలియచేసారు

# ఉగాదికి టిడ్కో గృహప్రవేశాలు




**నమస్తే హైదరాబాద్ :** చిత్తూరు, నవంబరు 28 ఉగాది నాటికి టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. టిడ్కో గృహాలపై తీసుకున్న నిర్ణయంతో చిత్తూరు నగర వాసులు 2832మందికి సొంతింటి కల నెరవేరనుంది. చిత్తూరు నగరం పూనేపల్లె వద్ద 2019 నాటికే అప్పటి టీడీపీ ప్రభుత్వం 2832 టిడ్కో గృహాల నిర్మాణాన్ని పూర్తి చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్మాణ దశలో ఉన్న 672 గృహాలను రద్దు చేసింది. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా 6288 గృహాలను రద్దు చేసి, డిపాజిట్ చేసినవారికి రూ.37.82 కోట్లను తిరిగి ఇవ్వలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు అప్పగించే ప్రక్రియ చేపట్టింది. టిడ్కో ఇళ్లపై ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ నివేదిక ప్రభుత్వానికి అందింది. మంత్రుల బృందాన్ని ఏర్పాటుచేసి ఈ నివేదికపై సమగ్రంగా చర్చించి ఏవిధంగా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోవాలని శుక్రవారం సీఎం చంద్రబాబు సూచించారు.కేంద్రీయ విద్యాలయకు 8 ఎకరాలు

చిత్తూరు మండలం మంగసముద్రం గ్రామంలో 8.08 ఎకరాల్లోని ప్రభుత్వ భూమిని కేంద్రీయ విద్యాలయకు ఉచితంగా కేటాయించడానికి మంత్రి మండలి ఆమోదం తెలిసింది. ఆ భూమి విలువ సుమారు రూ.2.77 కోట్లుగా అంచనా వేసింది. ఇదిలా ఉండగా, కుప్పంలో నెలకొల్పనున్న కేంద్రీయ విద్యాలయకు ఇప్పటికే భూమిని కేటాయించారు.

పలమనేరు మార్కెట్ కమిటీకి 33 ఎకరాలుపలమనేరులోని లైవ్‌స్టాక్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన 33 ఎకరాల్ని శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీ చేసేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇప్పటికే దీనికి సంబంధించి మార్కెట్ కమిటీ పరిహారం చెల్లించగా, భూమిని అధికారికంగా అప్పగించే ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ 33 ఎకరాల్లో 'పలమనేరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ' ని అన్ని హంగులతో ఏర్పాటు చేయనున్నారు. దామినీడులో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 28 ఎకరాలుతిరుపతి రూరల్ మండలం దామినీడులో స్పోర్ట్స్ కాంప్లెక్సు ఏర్పాటుకు ప్రభుత్వం 28.37ఎకరాల భూమిని శాప్‌కు కేటాయించేందుకు అంగీకరించింది. దామినీడులో 193-8, 193-9 తదితర సర్వే నంబర్లలోని ఈ భూమిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా జాతీయ ప్రమాణాలతో క్రీడల అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. కాగా ఈ భూములకు ఎకరా రూ. 2.50 కోట్లు చొప్పున కలెక్టర్ వెంకటేశ్వర్ మార్కెట్ విలువ సిఫారసు చేసినప్పటికీ ప్రభుత్వం పూర్తి ఉచితంగా భూములను క్రీడల కోసం కేటాయించింది.

# తెలంగాణ లేకపోతే కాంగ్రెస్, బీజేపీ కమిటీలు ఎక్కడ: మాజీ మంత్రి తలసాని



తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. తెలంగాణ లేకపోతే కాంగ్రెస్, బీజేపీ కమిటీలు ఎక్కడ అని ప్రశ్నించారు. ఆరోపిస్తున్నవారు తెలంగాణ సాధించినప్పుడు ఎక్కడున్నారంటు విమర్శించారు. తెలంగాణ రాకపోతే ఆరోపణలు చేస్తున్నవారికి పదవి ఎక్కడిది అంటూ మాజీ మంత్రి తలసాని ప్రశ్నించారు.

# టిడ్కో డబ్బులిస్తారా! వైసీపీలో టిడ్కో నిధులు మళ్లింపు

**నమస్తే హైదరాబాద్ :** ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టిడ్కో ఇళ్లు రద్దయిన వారి డబ్బులు రూ.10.20 కోట్ల మేర పేరుకుపోయాయి. ఆ రిఫండ్ డబ్బులు వస్తాయో రావో అన్నట్టుగా పరిస్థితి మారింది. నిధుల విడుదలకు ఆయా మునిసిపాలిటీల వారీగా ఎమ్మెల్యేలు సైతం ప్రయత్నం చేస్తున్నా అమరావతిలో టిడ్కో ఉన్న తాధికారులు మాత్రం ఉలుకు పలుకు లేకుండా ఉన్నారు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో రూ.6.53 కోట్లు, రామచంద్రపురం రూ.1.20 కోట్లు, పెద్దాపురం రూ.59.28 లక్షలు, మండపేట రూ.42 లక్షలు, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లో 21 లక్షల చొప్పున రిఫండ్ డబ్బులు పేరుకుపోయాయి.

టీడీపీ ఇస్తే..వైసీపీ వచ్చి లాగేసుకుంది..

2014లో అధికారంలోకి వచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణాలు, నగరాల్లో నివసించే పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు 2017-2019 మధ్య లబ్ధిదారులను ఎంపిక చేసింది. టిడ్కో ఇళ్ల కోసం ఆయా మునిసిపాలిటీలకు లబ్ధిదారుడి వాటాగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25వేల చొప్పున చెల్లించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లపై కత్తి కట్టింది. పేదలకు ఇవ్వకుండా నిలిపివేసింది. వేలాది మందికి మంజూరైన టిడ్కో ఇళ్లను రద్దు చేసేసింది. ఈ మేరకు లబ్ధిదారులకు అంతకు ముందు వారు చెల్లించిన మొత్తాన్ని వెనక్కు ఇవ్వాల్సి ఉంది. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ డబ్బులను అప్పటికే మునిసిపాలిటీల నుంచి టిడ్కోలో ప్రత్యేక ఖాతాకు మళ్లించేసి వాడేసుకుంది. దీంతో లబ్ధిదారులు ఎంత మొత్తు కున్నా వారి డబ్బులను వెనక్కివ్వలేదు. చివరకు ఇప్పటికి ఐదేళ్లవుతున్నా ఏ ఒక్కరికీ డబ్బులు రిఫండ్ రాక వారంతా లబోదిబోమంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.10.20 కోట్ల వరకు ఈ సొమ్ములు పేరుకుపోయాయి.

ఎక్కడెక్కడ ఎంత ఇవ్వాలంటే..కాకినాడ కార్పొరేషన్ పరిధిలో రూ.6.53 కోట్లు రిఫండ్ డబ్బులు వెనక్కు రాక లబ్ధిదారులు నెత్తీ నోరు బాదుకుంటున్నారు. రూ.లక్ష చొప్పున 589 మందికి, రూ.25 వేల చొప్పున 150 మందికి, రూ.50 వేల చొప్పున 448 మందికి డబ్బులు రాలేదు. అప్పట్లో కార్పొరేషన్ పరిధిలో 2,056 టిడ్కో ఇళ్లు నిర్మించారు. సైట్-ఏలో 1,152 ఇళ్లు, సైట్-బీలో 904 ఇళ్లు నిర్మిం చారు. వీటికి సంబంధించి ఇళ్లు మంజూరై ఆనక రద్దయిన, రద్దు చేసుకున్న లబ్ధిదారులకు రూ.6.53 కోట్లు వెనక్కు రాలేదు. సామర్లకోట మునిసిపాలిటీ పరిధిలో 1,056 ఇళ్లు నిర్మించగా వీటిలో రద్దు చేసు కున్న వారికి రూ.25 లక్షలు వెనక్కు రావాల్సి ఉంది. ఇందులో రూ.లక్ష చొప్పున 33 మందికి రావాల్సి ఉంది. పెద్దాపురం మునిసిపాలిటీలో 3,312 ఇళ్లు



నిర్మించగా రద్దు చేసుకున్న వారికి రూ.59.28 లక్షలు ఐదేళ్ల నుంచీ వెనక్కు రావడం లేదు. వీరిలో రూ.లక్ష చొప్పున చెల్లించిన వారు 55 మంది, రూ.50 వేల చొప్పున చెల్లించిన వారు 106 మంది ఉన్నారు. పిఠాపురంలో 864 టిడ్కో ఇళ్లు నిర్మించగా రూ.10 లక్షలు ఇంకా వెనక్కు రాలేదు. రామచం ద్రపురం మునిసిపాలిటీలో లబ్ధిదారులకు రూ.1.20 కోట్లు రావాల్సి ఉంది. వీరిలో రూ.లక్ష చొప్పున చెల్లిం చిన వారు 92 మంది ఉన్నారు. మండపేట ము నిసిపాలిటీలో రూ.42 లక్షలు, అమలాపురం మునిసిపాలిటీ రూ.40 లక్షలు రావాల్సి ఉంది. తూర్పుగో దావరి జిల్లా నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీల పరిధిలో రూ.21 లక్షల వరకు రావాల్సి ఉంది.లబ్ధిదారులకు వెనక్కు ఇవ్వాల్సిన డబ్బులను అప్ప టి వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వాడేసుకుంది. దీంతో రిఫండ్ డబ్బులు ఎవరికీ రాలేదు. ప్రభుత్వం మారిన తర్వాత అనేక మంది బాధితులు ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చి కలెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తున్నారు. తమ డబ్బులు తమకు ఇప్పిం చాలని కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల వద్దకు సైతం లబ్ధిదారులు తిరుగుతున్నా పనవడం లేదు. ఈ నిధులు లబ్ధిదారులకు వెనక్కి వ్వాలని కలెక్టర్లు,ఎమ్మెల్యేలు సైతం టిడ్కోకు లేఖలు రాసినా ఎలాంటి ప్రయోజనం లేదు. తమ వద్ద ఆ నిధులు లేవని అక్కడి అధికారులు సమాధానం చెబుతున్నారు. దీంతో రిఫండ్ డబ్బులపై అయో మయం నెలకొంది. ఇటీవల కాకినాడకు వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ దృష్టికి అధికారు లు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం దృష్టికి మరోసారి తీసుకువెళ్తానని పేర్కొన్నారు.

# ఉత్పత్తి పెంచకుంటే మనుగడ కష్టం



**రోజుకు 19 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేయాలిసామర్థ్యం**

**92.5 శాతానికి పెరగాలి**

**బ్యాంకుల రుణాలతో పెరిగిన వడ్డీల భారం**

**ప్రతి నెలా రూ.100 కోట్ల లాభాలు రావలసిందే**

**ఇకపై కేంద్రం సాయం చేయడం కష్టం**

**ఉక్కు ఉద్యోగుల సమావేశంలో మంత్రిత్వ శాఖ**

**జాయింట్ సెక్రటరీల ప్రకటన**

**నమస్తే హైదరాబాద్ :** స్టీల్‌ప్లాంటులో రోజుకు 19 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి తీస్తేనే మనుగడ ఉంటుందని, లేదంటే కష్టమని ఉక్కు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీలు శుక్రవారం స్పష్టంచేశారు. ఢిల్లీ నుంచి జాయింట్ సెక్రటరీలు అభిజిత్ చక్రవర్తి, దయానిధన్ పాండేలు రాగా సీఎండీ ఏకే సక్సేనా దశల వారీగా ఉద్యోగులకు నాలుగు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్లాంటు పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బ్యాంకుల నుంచి రుణాలు భారీగా తీసుకున్నందున వడ్డీల భారం పెరిగిందని, ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం 92.5 శాతానికి చేరితేనే ఆర్థిక ఫలితాలు బాగుంటాయని వెల్లడించారు. లాభాలు పెంచాలని, ఇవి ప్రతి నెలా రూ.100 కోట్లు ఉంటేనే రుణాలకు తిరిగి చెల్లింపులు చేయగలుగుతామన్నారు. ప్లాంటులో ఉత్పత్తి స్థిరంగా ఉండాలని, కన్వేయర్ బెల్ట్‌ల బ్రేక్ డౌన్‌లు లేకుండా చూడాలని సూచించారు. ఆపరేషన్లలో ఇబ్బందులు లేకుండా ఉద్యోగులే బాధ్యత తీసుకోవాలన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్‌లకు కోక్ సమస్య ఉందని అంగీకరించారు. అమ్మకాలు కూడా పెంచాలని, అన్ని విభాగాల్లో వ్యయాలు తగ్గించాలని సూచించారు. ఇకపై కేంద్రం నిధులు ఇచ్చే అవకాశం లేదని, ఉత్పత్తి లక్ష్యాలు సాధించకపోతే కష్టాలు తప్పవని పరోక్షంగా హెచ్చరించారు.

కన్వేయర్ బెల్ట్‌ల నిర్వాకం ఉద్యోగులదేనని సీపీకి ఫిర్యాదు నవంబరు నెలలో కన్వేయర్ బెల్ట్‌లు మూడుసార్లు తెగిపోయాయి. దీనివల్ల ఉత్పత్తి తగ్గిపోయింది. ఉద్యోగులే కావాలని బెల్ట్‌ను కోసేస్తున్నారంటూ యాజమాన్యం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దాంతో ఆయన శుక్రవారం ప్లాంటుకు వచ్చి అన్నీ పరిశీలించారు. అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓ మహిళా అధికారిణి మాట్లాడుతూ స్టీల్ ప్లాంటు ఉద్యోగులు ఇలాంటి తప్పుడు పనులు చేయరని, నిర్వహణ లేకే అవి తెగిపోతున్నాయని వివరించారు. యాజమాన్యం మాత్రం ఎన్నడూ లేనిది ఇప్పుడే ఎందుకు తెగుతున్నాయని వాదించింది. కాంట్రాక్టు కార్మికులను వేల సంఖ్యలో తగ్గించేసి, నిర్వహణకు నిధులు ఇవ్వడం ఆపేస్తే ఏ యంత్రాలైనా ఇలాగే అవుతాయని అధికార వర్గాలు వాదిస్తున్నాయి. ఈ సందర్భంగా జరిగిన చర్చలో అధికారుల సంఘం నాయకుడు ఒకరు బ్లాస్ట్ ఫర్నేస్‌ల సమస్యను ప్రస్తావించగా, ఇప్పుడు దానిపై చర్చ వద్దని, కేవలం కన్వేయర్ బెల్ట్‌లపైనే మాట్లాడాలంటూ సమావేశాన్ని ముగించి జాయింట్ సెక్రటరీలు వెళ్లిపోయారు. వారు వచ్చిన విషయం స్థానిక ఎంపీకి కూడా సమాచారం లేదని, యాజమాన్య ప్రతినిధులు ఉద్యోగులను దోషులుగా చిత్రీకరిస్తున్నారని, ఈ విధానం మానుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైన ముడి పదార్థాలు ఇవ్వకుండా 92.5 శాతం యుటిలైజేషన్ ఏ విధంగా సాధ్యమవుతుందో యాజమాన్యమే చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

# అలర్ట్: నేడు-ఎల్లుండి అతి భారీ వర్షాలు!"

**నమస్తే హైదరాబాద్ :** నైరుతి బంగాళాఖాతం మరియు శ్రీలంక తీరానికి సమీపంలో దిత్వా తుఫాన్ కొనసాగుతోంది. తుపాను ప్రస్తుతం ఉత్తర%-%వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రస్తుతానికి ఈ వాయుగుండం పుదుచ్చేరికి సుమారు 410 కి.మీ, చెన్నైకి 510 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని, గడిచిన ఆరు గంటల్లో సుమారు 3 కి.మీ వేగంతో కదిలిందని ఆయన వివరించారు.ఎల్లుండి తెల్లవారుజామునకు ఇది తీవ్ర వాయుగుండంగా మారి తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలను చేరే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ హెచ్చరించారు. మత్స్యకారులు మంగళవారం వరకు సముద్రంలోకి వెళ్ళరాదు అని సూచించారు.దిత్వా ప్రభావంతో రేపు మరియు ఎల్లుండి దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు. ప్రభుత్వ? ప్రకారం, ప్రకాశం, నెల్లూరు, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉంది. అవసరమైన సహాయక చర్యల కోసం %చీణ=ఖీ, ూణ=ఖీ% బృందాలు సిద్ధంగా ఉంచబడ్డాయి. దక్షిణ తీర ప్రాంతాల్లో గంటకు 50%-%70 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చునని, ప్రజలు చెట్ల క్రింద నిలబడరద్దని, అత్యవసర పరిస్థితుల్లో 1070, 112, 18004250101 నంబర్లను సంప్రదించమని విజ్ఞప్తి చేశారు. రైతులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రానున్న రెండు రోజుల వాతావరణ అంచనా ప్రకారం, శనివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో మోస్తరు నుంచి



భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. బాపట్ల, పల్నాడు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.ఆదివారం కూడా వాతావరణ పరిస్థితులు గంభీరంగా ఉంటాయి. ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.



# రైల్వే ప్రయాణికులకు అలర్ట్.. పలు రైళ్లు రద్దు

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విశాఖపట్నం%-%విజయవాడ రూట్‌లో ఆధునికీకరణ పనులను నిర్వహిస్తున్నారు. జనవరి 27 నుంచి 31 వరకు మొత్తం 16 రైళ్లను రద్దు చేయనున్నారు. ఈస్టకోస్ట్ రైల్వే ప్రయాణికులు ప్రణాళికలు మార్చుకోవాలని సూచించింది. విజయవాడ%-%విశాఖ, గుంటూరు%-%విశాఖ, లింగంపల్లి%-%విశాఖ, తిరుపతి%-%పూరి సహా పలు రైళ్లు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

